# మాయ

కాలేజి స్టాఫ్‌రూం గోడవారగా నిలబడి ప్రేమ, మాయ ఇద్దరూ ఏదో ముచ్చటించు కొంటున్నారు. బహుశా క్రితంరోజు చూసిన సినిమాలోని "ప్రేమ" గురించే కాబోలు.

"దాన్ని ప్రేమ అనకు. మాయ, మోహం, కామం అంటారు" సీరియస్‌గా అంది మాయ.

కాలేజీ లెక్చరర్ ఎవరో 'ఆఖ్‌థూ' అని కిటికీలోంచి గట్టిగా బయటకు ఉమ్మేశాడు. గాలికి అది ముఖం మీద పడేదే. చటుక్కున దూరం జరిగింది ప్రేమ.

"మన లెక్చరర్లకు ఏమైనా బుద్ధి సంస్కారం ఉందంటావా?" విసుగ్గా అంది ప్రేమ.

"రాత్రి మనం చూసిన సినిమాలోని ప్రేమ కథ కూడా ఈ ఉమ్మి వంటిదే. బుద్ధీ సంస్కారం లేని ప్రేమ అది. గొంతులో ఊరిన తెమడను ఎలాగోలా బయటకు ఉమ్మేసినట్టుంది ఆ ప్రేమ". అసహ్యంగా స్టాఫ్‌రూం కిటికీకేసి చూస్తూ అంది మాయ. ఆ మాటలో ఏదో నీచార్థం స్ఫురణకొచ్చి సిగ్గుపడిపోయింది ప్రేమ.

"ప్రేమంటే నీ ఉద్దేశంలో ఏమిటే" ఆప్యాయంగా అడిగింది ప్రేమ. ఎవరో యిద్దరు కుర్రాళ్ళు తమకేసే చూస్తూ వెళ్లటం గమనించి అదేమీ పట్టనట్టు మాయకేసి తిరిగింది ప్రేమ.

"కౌగిలింతలు, శరీరాలు కలుసుకోవడాలు మాత్రం ప్రేమ కాదు. అదంతా మాయా మోహం. ప్రేమంటే రెండు హృదయాల కలయిక. ప్రేమంటే సహృదయత...." మాయ చెప్పడానికి మాటలు రాక, చెప్పడానికి సిగ్గులాంటిదేదో అడ్డంవచ్చి తడబడి ఆగిపోయింది.

"తల్లి దండ్రి తాకనిదే నీవు లేవు, నేను లేను. ఈ లోకమే లేదు" అన్న ఎఎన్నార్ పాట వినలేదా నీవు!" సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది ప్రేమ.

"అలాంటి వాటిని లైంగిక అవసరాలు అంటాను. వాటికోసమే ఆరాటపడడం జంతువులతో సమానం. రాత్రి చూసింది మనుషుల ప్రేమ కాదు, జంతువుల కన్నా హీనంగా ప్రవర్తించిన మృగాల ప్రేమ. మృగాల లైంగిక అవసరాలకు కొన్ని రుతువులు సీజన్లుంటాయి. మనిషిలోని మృగానికి ఎప్పుడూ సీజనే. అందుకే వారిది మృగాల కన్నా హీనమైన మాయా మోహం" మాయ స్థిరంగా అంది.

"చలం, రంగనాయకమ్మ, ఓల్గా రచనల్లోని ప్రేమ గురించి నీ అభిప్రాయం ఏమిటే?" తనకు ప్రేమంటే ఏమిటో తెలుసునన్నట్టుగా చిన్నగా నవ్వుతూ అడిగింది ప్రేమ. ఆ నవ్వులో తానే కరెక్టు అనే ఆత్మవిశ్వాసం ఉంది.

మాయ అంతకన్నా మొండి ఆత్మవిశ్వాసంతో నవ్వింది. ఎదుటివారిని యుద్ధంలో ఓడించే ముందు నవ్వే నవ్వు అది. ఆ నవ్వుకు ప్రేమ ఆత్మవిశ్వాసం సగం చచ్చిపోయింది.

"చలం చెప్పింది ప్రేమే అయితే ఆయన రమణాశ్రమానికి ఎందుకు వెళ్తాడు. చలం చెప్పింది నిజమైన ప్రేమ కాదు. అది మాయామోహం. ఆయనకు నిజంగా ప్రేమ గురించి తెల్సి ఉంటే ప్రజల్ని ప్రేమిస్తూ బుద్ధుడిలా ప్రజల మధ్యే ఉండేవాడు. కనీసం అభిసారిక రాంషా శిరీషల్లా తోచిన మేరకు యువతీ యువకుల భయాలు, అనుమానాలు తీరుస్తూ వారిలో నిజమైన ప్రేమను ఉద్దీపింపచేస్తూ

ప్రజల మధ్య శేషజీవితం గడిపి ఉండేవాడు. మాయా మోహాన్ని చూసి చూసి విసుగెత్తి రమణాశ్రమానికి వెళ్ళాడు. ప్రేమ విసుగెత్తదు. నిత్యనూతనంగా ఉంటుంది". ఏవో గుర్తొచ్చి ఊహాలోకాల్లో విహరిస్తూ అంది మాయ.

"అయితే రంగనాయకమ్మ, ఓల్గాల మాటేమిటి?" ప్రేమ తాను ఓడిపోవడానికి సిద్ధంగా లేనన్నట్టుగా అంది.

మాయ విరాగిలా నవ్వింది.

"వాళ్ళు లైంగిక స్వేచ్ఛ గురించి, లైంగిక అణిచివేత గురించి స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన సంబంధాల గురించి రాశారు. అంటే ఎంత చేసీవాళ్ళు ప్రేమంటే లైంగికత, సెక్సువాలిటీలో భాగమని భావిస్తున్నారనే కదా అర్థం. వాళ్ళు కుటుంబం గురించి కూడా సెక్సువాలిటీ కేంద్రంగానే చర్చించారు. నా ఉద్దేశంలో వాళ్ళు మాయా మోహాలను మరింత అందంగా ప్రేమ అని వర్ణిస్తున్నారేమోనని."

"అంటే లైంగికత, సెక్సువాలిటీ ప్రమేయం లేని ప్రేమ ఉంటుందంటావా?" అంది ప్రేమ.

"అవును. నీకూ నాకూ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనా? మన ఇద్దరి మధ్య ప్రేమ లేదంటావా? లైంగికతను, లైంగిక అవసరాలను మాత్రమే ప్రేమ అనేదైతే నీకూ నాకూ మధ్య ఉన్నది సలింగప్రేమా? అంటే లెస్బియన్సుమా మనిద్దరం".

ప్రేమకు చివరి మాటతో వెంపరం పుట్టింది. మాయను ఓసారి ముద్దు పెట్టుకున్న విషయం గుర్తొచ్చి సిగ్గుపడిపోయింది. ఎందుకో ఆ రోజు మాయ చాలా ముద్దొచ్చింది. తను, తన చెల్లెల్ని ముద్దుపెట్టుకున్నట్టే ముద్దు పెట్టుకుంది. అది హర్షాతిరేకం, సహృదయతే తప్ప మరే భావన లేదు. మాయ చెప్తున్నదాన్లో ఏదో పాయింటుందనిపించింది.

"అన్నా చెల్లెల్ల మధ్య, తల్లీ పిల్లల మధ్య, ఉండే ప్రేమ గురించేనా నువ్వు అంటున్నది?" అంది ప్రేమ.

"అవును. మనిషికి మనిషికీ మధ్య ఉండే మానవీయ సంబంధాల్లో ఉండేదే ప్రేమ. విశ్వజనీన ప్రేమకు సెక్సుతో పనిలేదు. సెక్సువాలిటీతో పనిలేదు. మానవ సంబంధాలన్నీ ప్రేమపూరితం కావాలి."

ఈ మధ్యనే చదివిన ఏదో పాత నవలలోని "ఆమ్రపాలి" మాటలు గుర్తొచ్చాయి ప్రేమకు. అది చదివిన్నించి మాయలో ఏదో మార్పు గమనిస్తోంది. అది ఇపుడు స్పష్టమైపోయింది. స్పష్టంగా ఇది బుద్ధుని శిష్యురాలుగా మారిన ఆమ్రపాలి ముద్రే.

కిటికీలోంచి గట్టిగా అరిచిన అరుపులు వినపడి ప్రేమ, మాయ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఆ అరుపుల్లో ప్రేమ అనే పదం వినపడి తమ సంభాషణ కట్టిపెట్టి ఆసక్తిగా చెవి పెట్టారు.

"భవబంధాల్ని ప్రేమంటే నేను అంగీకరించలేను. కుటుంబ సంబంధాల్లో, కుల సంబంధాల్లో ప్రేమలా కనపడేది ప్రేమ కాదు. అది మాయామోహం. అవి ప్రేమబంధాలు కావు. ఆశాపాశాలు. శ్లేష్మంతో (చీమిడి)లో పడ్డ ఈగలా ఈ మానవులు ఈ ఆశాపాశాల మాయామోహాల్లో చిక్కుకుని తన్ను తాను ఎరుగలేకుండా ఉన్నారు."

సాయిబాబా భక్తి ఈ మధ్య మరీ ఎక్కువైపోయిన కెమిస్ట్రీ లెక్చరర్ శంకరాచార్య గారి గొంతు అది. ఇందాక కిటికీలోంచి కాండ్రించి ఉమ్మింది ఆయనే. ఆ విషయం తెల్సి ఉంటే అతని భావాల్ని మరో తీరుగా స్వీకరించి ఉండేవారు.

ఆ మాటల్తో మాయ చకితురాలైపోయింది. ఆశాపాశాలు లేని ప్రేమ బంధాల గురించి ప్రేమ గురించి తాను ఎంతో కొంత చదివింది. కానీ దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలాగో తెలియడం

లేదు. తల్లీ పిల్లల మధ్య, అన్నదమ్ముల మధ్య, అక్కా తమ్ముళ్ళ మధ్య, వదినామరదళ్ళ మధ్య స్నేహితుల మధ్య ఉండేవి కూడా ప్రేమబంధాలు కావు. అవి ఆశాపాశాల మాయామోహాలు అనేనా శంకరాచార్య అంటున్నది అని మాయ ఆలోచనలో పడిపోయింది.

తాను అమ్మానాన్నలను ప్రేమించడం, ప్రేమను ప్రేమించడం కూడా ఆశాపాశాల మాయామోహాలేనా అని ఆలోచనలో పడిపోయింది మాయ.

ప్రేమకు తలతిరిగిపోతోంది. ఆయన మాట్లాడింది తెలుగే అయినా ఆయన చెప్పే కెమిస్ట్రీలాగే ఇదీ అర్థం కావడం లేదు. తన కాళ్ళకింది భూమి కదిలిపోయినట్లుగా నిస్సత్తువ నిరాశ ఆవరించింది. ఇవేవీ ప్రేమ కానపుడు ఇంకదేన్ని ప్రేమంటారో అని నీరసించిపోయింది.

"పరిశుద్ధమైన నీరు ప్రపంచంలో ఎక్కడా దొరకనట్టే. మీరు చెప్పే పరిశుద్ధమైన ప్రేమ ఎక్కడా ఉండదు - మీరిలా ప్రేమలోని ప్రతిదాన్నీ మాయ అనుకుంటూ పోతే". ఫిజిక్సు లెక్చరర్ ఆచార్య నాగార్జున పాఠం చెప్పినంత ప్రశాంతంగా అన్నాడు. మళ్ళీ తనే అన్నాడు. "అలా ప్రతిదాన్ని అనుకుంటూ పోతే మిగిలేది ప్రేమా కాదు, మాయా కాదు శూన్యమే." ఆచార్య నాగార్జునలో పూర్వాశ్రమంలో చదివేసిన మార్క్సిజం, గతితర్కం వాసనలు అప్పుడప్పుడు కనపడుతుంటాయి.

"నాగార్జునగారూ, నేను శూన్యం గురించి చెప్పడం లేదు. మాయ గురించి చెప్తున్నాను బాబాగారు వివరించిన మాయ గురించి మాట్లాడుతున్నాను. మాయలోంచి ఆశాపాశాలు, కామం తీసేస్తే అదే ప్రేమ. అందుకే నిష్కామకర్మయే నిజమైన ప్రేమ."

"నేను అడిగేదీ అదే. శంకరాచార్యగారూ! నిష్కామకర్మంటూ ఉండడం సాధ్యమేనా! భవబంధాల్ని, ప్రేమ, స్నేహ సహచర్యాల్ని మాయామోహాలు ఆశాపాశాలు లేకుండా ఈ సామాజిక జీవిత సంబంధాల్లో ఎలా ఆచరించి చూపుతారో నాకు అర్థం కావడం లేదు. మీ కూతురుకు మెడికల్ సీటు దొరికేదాకా మీరెంత తాపత్రయపడ్డారో మీకు గుర్తుందనుకుంటాను. మీ ఆ తాపత్రయంలో మాయలేదా! ఆశాపాశాలు లేవా? నిష్కామప్రేమే ఉందంటారా? అది నిష్కామ ప్రేమైతే అందరి గురించి మీరు అలాగే ఆరాటపడాలి కదా. అలా చేయలేదేమి?" వాస్తవాలకూ భావాలకూ మధ్య లింకు కలుపుతూ అడిగారు ఆచార్య నాగార్జున.

శంకరాచార్యగారికి తనలోని వైరుధ్యం తనకే తెల్సి వస్తూ ఉంది. కాని తన విశ్వాసం సరైందేనని అన్పిస్తోంది. ఆ విశ్వాసంలో ఏదో ఆదర్శం, అలౌకిక ఆనందం ఉన్నట్టుగా తోస్తోంది. దాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాడు. వంచిన తలఎత్తి విశ్వాసపూరితంగా అన్నాడు.

"నాగార్జునగారూ మీది తర్కం. కాకపోతే గతితర్కం. నాది విశ్వాసం. తర్కానికి వాస్తవిక హేతునిరూపణ అవసరం. అన్నిటినీ తర్కంతో రుజువుపరచలేం. తర్కం తాలూకు రూపానికి అందని భావాలు, వాటి ప్రమేయాలు ఉంటాయి. నేను మాయామోహాల్లో జీవిస్తున్నానన్నది వాస్తవం. అయితే ఇది మాయ అని తెల్సుకొనడం కూడా. ఈ జీవితంలో భాగంగానే సాధ్యపడింది కదా. ఆ మేరకు నేను నా ఆత్మకి భావాల్లో మాయ అంటే ఏమిటో ఎరుక కలిగే ఉన్నట్టే కదా!"

"ఆ ఎరుక కలిగినాక మీలో, మీ ఆచరణలో వచ్చిన మార్పేమీ లేకపోతే దాన్ని మీ మాటల్లోనే మాయ అంటాను. మీ జీవితం మాయ. మీ ప్రేమ మాయ. ఈ మాయ మీలోంచి తొలగిపోగానే మీ జీవితం శూన్యం అవుతుంది. మీరు శూన్యం అవుతారు. అంతేగాని ప్రేమమయంగా ఎలా మిగలగలరు?"

స్టాఫ్‌రూంలోకి గబగబా కొందరు చొచ్చుకు వచ్చిన సందడి వినిపిస్తోంది. ప్రేమ, మాయ ఆసక్తిగా వింటున్న. ఆ సంభాషణ ఆగిపోయింది.

"ఇక్కడ గప్పాలు కొట్టుకుంటూ కూర్చోవడానికేనా సార్ మీరు నెలనెలా పదివేల జీతాలు

తీసుకుంటున్నది. ఎవరో దురుసుగా వారిమీద కురికారు. "లెక్చరర్ల దౌర్జన్యం నశించాలి" అని ఎవరో అరిచారు. స్టాఫ్‌రూం విద్యార్థులు అంటున్న ఆ నినాదంతో దద్దరిల్లి పోయింది.

"సారీ మాటల్లో పడి పదినిమిషాలు లేటైనందుకు సారీ" ఆచార్యులిద్దరూ లేచారు.

గోడవారగా నున్న ప్రేమ, మాయ అక్కన్నించి కదిలారు.

వారం రోజులు గడిచినా ప్రేమ మాయ గురించి, మాయ ప్రేమ గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. తమకు తోచినట్టుగా చర్చిస్తూనే ఉన్నారు.

గాంధీ అంతటివాడికే నిష్కామకర్మ సాధ్యం కాలేదు. ఆయన నిష్కామంగా పనిచేస్తూ ఉంటే సుభాష్ చంద్రబోస్ కాంగ్రెసు అధ్యక్షుడైతే అంతగా అలకపాన్పు ఎక్కడందేనికి? అంబేడ్కర్ కోరి సాధించిన ఆ కమ్యూనల్ అవార్డు రద్దు చేయించి గాంధీ పూనా ఒప్పందం కోసం ఆమరణ నిరాహారదీక్ష ఎందుకు పూనుతాడు. జనకమహారాజు నిష్కామంగా రాజ్యం ఏలేవాడంటే సీతలా అందర్నీ ఎందుకు చేరదీసి సాదలేకపోయాడు. కృష్ణుడు ఏ ఒక్కరోజైనా నిష్కామకర్మ చేయగలిగాడా? అంతా ఆశాపాశాల పక్షపాత బుద్ధేగదా! ఆయన కృష్ణగీతలో నిష్కామకర్మ గురించి చెప్పడం హాస్యాస్పదం కాదా - వంటివెన్నో విషయాల్ని ప్రేమ, మాయ చర్చించుకున్నారు. అయినా వారికి సమాధానం దొరకలేదు.

ఒక సాయంత్రం పార్కులో కూర్చున్నారిద్దరూ.

"ఆశయాలను నిష్కామంగా ఆచరించడమే నిష్కామకర్మ" అంది ప్రేమ.

అయితే నీ ఆశయాలను నిష్కామంగా నిర్ణయించుకున్నపుడే నీవన్నది కరెక్టవుతుంది" అంది మాయ. మళ్ళీ తనే అంది. "అయితే నిష్కామంగా ఆశయాల్ని నిర్ణయించుకోవడం సాధ్యమా! ఆశయం అనేదే ఒక ఆశాపాశాల కామకర్మ కదా!"

"అయితే ఏది నిష్కామకర్మ అని తేల్చుకోవడం ఎలా? బుద్ధుడు ఈ విషయంలో ఏం చెప్పాడు!" ప్రేమ మాయను అడిగింది.

"ఇలాంటి చర్చలు బుద్ధిలేని వాళ్ళ పండిత చర్చలు అని బుద్ధుడు ఈసడించాడు. ప్రేమ, ప్రజ్ఞ, కరుణ, అష్టాంగమార్గం జీవన విధానంగా ఉండాలన్నాడు." అని నిరాశగా అంది మాయ. ఆ నిరాశలో బుద్ధుడు చెప్పింది ఇంకా తనకు తృప్తిగా లేదనే భావన ఉంది.

"మనం పెళ్ళి చేసికొన్నాక మన భర్తలకు ఈ ప్రశ్నలు వేస్తే ఏం జవాబు చెప్తారంటావు?" ఆసక్తిగా అడిగింది ప్రేమ.

భళ్ళున నవ్వింది మాయ. పార్కులో చుట్టుపక్కల కూర్చున్నవాళ్ళు ఆశ్చర్యంగా వాళ్లవైపు చూశారు. మాయ సిగ్గుపడిపోయింది. గొంతు తగ్గించి యిలా అంది.

'వాళ్ళ మూడ్‌ని బట్టి, స్వభావాన్ని బట్టి వాళ్ళు ఏమైనా అనవచ్చు. ఏమి ప్రియా నా మీద ప్రేమ తగ్గిందా అని అడగవచ్చు. లేదా నా ప్రేమలో మాయామోహాలే తప్ప ప్రేమ లేదంటావ్ - హు! అని ఈసడించవచ్చు. లేదా యింకేదైనా అనవచ్చు. అంతేగానీ నాలాగా నీలాగా ప్రశాంత చిత్తంతో చర్చించకపోవచ్చు. నా ఉద్దేశ్యంలో మగవాళ్ళకు అలాంటి హృదయం ఉండకపోవచ్చుననుకుంటాను. ఉంటే చలం రమణాశ్రమానికి ఎలా వెళ్తాడు, మాయామోహం తీరినాకైనా నిష్కామ ప్రేమ వైపు ఎదిగి ఉండేవాడు."

"మనం ఈ విషయంలో నాగార్జున సార్‌తో చర్చిస్తే మంచిదేమో" అంది ప్రేమ.

"నాకూ అదే ఆలోచన వస్తోంది" అంది మాయ.

ఓ రోజు కాలేజీ స్టాఫ్ రూంలో అడిగి టైం తీసుకుని సాయంత్రం నాగార్జున ఇంటికి వెళ్ళారు ఇద్దరు. పదో తరగతి చదువుతున్న మేధ వారిని నవ్వుతూ పలకరించింది. వారిని కూర్చోపెట్టి అమ్మా అంటూ లోనికి ఉరికింది. సార్‌లేనట్టున్నాడు అనుకున్నారిద్దరు. వారికి టీ యిచ్చి వారితోపాటు తనూ

కూర్చుంది మేధ. మేధ తల్లి మహామాయ చేతులు తుడుచుకొని వారి ఎదుట కూర్చుంది. తనూ టీ తీసుకుంది.

"మీరేదో ప్రేమ గురించి చర్చిస్తామన్నారట కదా!" నవ్వింది మహామాయ.

"సార్ మీక్కూడా చెప్పాడా ఆంటీ" అని సంతోషపడింది ప్రేమ.

"ఆఁ! ఏదో అర్జంటు పనిమీద బయటకు వెళ్ళారు ఆయన. ఈ లోపు మనని చర్చించుకోమన్నారు. వెంటనే వస్తానన్నారు" అంది మహామాయ.

"ప్రేమంటే ఏమిటి?" ప్రేమ చర్చను ప్రారంభించింది.

"ప్రేమంటే ప్రేమే" అని నవ్వింది మేధ.

"ఏది మాయో తెల్సుకుంటే ఆ తర్వాత మిగిలేది ప్రేమ అన్నట్టు మాట్లాడారు శంకరాచార్య గారు" అంది ప్రేమ.

"ఏది మాయో తెల్సుకుంటే తెలిసేది మహామాయ అవుతుంది గానీ ప్రేమ ఎలా తెలుస్తుంది?" మహామాయ అంది.

"అసలు శంకరాచార్య మాయ అనే పదాన్ని వాడాలని ఎందుకనుకున్నారు" అడిగింది ప్రేమ.

"పుట్టబోయే ముందు మనుషులు తల్లి మాయలో తొమ్మిది నెలలు జీవిస్తారు. శిశువు పిండాకృతి ధరించి ప్రాణం పోసుకుని ఆరోగ్యంగా బయటి ప్రపంచానికి ప్రసవం రూపంలో వచ్చేందుకు సహకరించేది మాయ" అంది మహామాయ.

బీజం, పిండం, మాయ, ఉమ్మనీరు ప్రసవం ఎలా జరుగుతుంది అనే విషయాల మీద కొంతసేపు చర్చ సాగింది. తిరిగి ప్రేమ మీదికి చర్చ మళ్ళింది. ఆచార్య నాగార్జున లేటయినందుకు సారీ అంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు. అంతదాకా చర్చించిన విషయాలు అతడు ఉంటే సాధ్యమై ఉండేవి కావు. చర్చ సాగడానికి కావాలనే కొంతసేపు అలా వెళ్ళినట్టున్నారు అని అనుకుంది మాయ.

"శిశువుకు తల్లి కడుపులో రక్షణ యిచ్చి పెంచి పోషించేది మాయే. మనుషులు మాయా మోహాల్తో పరస్పరం కలుసుకోవడం, సహకరించుకోవడం కూడా మాయే. ఈ రెండు మాయలూ ఒకేలా ఉన్నట్టున్నాయి" ఏదో తెల్సిపోయినట్టు సంతోషంతో అరిచినట్టుగా అంది ప్రేమ.

"మాయ విషయం మగవాళ్ళకు అర్థం కావడం కష్టం అని నేననలేదా? శంకరాచార్య మగవాడు కనకే ఆయనకు మాయ అర్థం కాకుండా పోయింది" అంది మాయ.

నాగార్జున ముఖం తుడుచుకుంటూ వచ్చి వారితో కలిసాడు.

"మాయ అన్నదాన్లో వాస్తవం ఉంది. శంకరాచార్యకు మాయ గురించి తెలియదనుకుంటాను. ఎందుకంటే ఆయన మాయా మోహాల్లో చిక్కుకోలేకపోవడండ వల్లనే ఈ సంసారిక జీవన బంధాలన్నీ మాయ అని అనడం జరిగి ఉంటుంది. ఈ మాయ మోహాల్లో చిక్కుకొని ఉంటే యిదే వాస్తవం అని ఉండేవాడేమో" అన్నాడు నాగార్జున.

"ఇంతకూ మాయ అంటే మీరేమనుకుంటున్నారు" మాయ నాగార్జునకేసి చూస్తూ అడిగింది.

"సమాజాన్ని, సామాజిక సంబంధాలను నడిపించే శక్తే మాయ, ప్రతిసామాజిక సంబంధంలో మాయ ఉంటుంది. మాయ వల్లే మనుషుల మధ్య సంబంధాలు ఆకర్షణీయం, ఆసక్తికారకం అవుతున్నాయి. మాయ మనుషులను నడిపే జీవశక్తి. మాయ అనేది యవ్వనంలో ఉండే ఆకర్షణ వంటిది." అన్నాడు నాగార్జున.

"భక్తమీరాబాయి ప్రేమ - మాయా? ప్రేమా?" హఠాత్తుగా అడిగింది మాయ. మళ్ళీ తనే అంది. ఎందుకంటే ఆమె ఏమీ కోరుకోలేదు. మీరన్న ఆకర్షణీయ మాయలో పడలేదు. కాని భక్తితో ప్రేమించింది. దీన్నేమంటారు? మీరు మాయను ప్రేమకు పర్యాయపదంలాగా వాడుతున్నా

రేమిటి?'' ఆశ్చర్యపోతూ నిలదీసింది మాయ.

మేధకు చర్చస్థాయి అందినట్టులేదు. ఏదో కొత్త విషయాలు వింటున్నట్టుగా అన్పిస్తోంది అంతే. మాయ గట్టి పిల్లే అని మెచ్చుకోలుగా చూసింది మహామాయ. తన వివరణలో ఎక్కడో పొరపాటు దొర్లిందని ఆలోచనలో పడ్డాడు నాగార్జున. ఆయన మౌనంగా ఉండటంతో మరికొంచెం ధైర్యం పుంజుకొంటూ మళ్ళీ నిలదీసింది మాయ.

"బుద్ధుడు మాయలో పడకుండానే ప్రజల్ని ప్రేమించాడు. మాయతో పనిలేకుండానే ప్రపంచాన్ని ప్రేమించడం ఎలాగో నేర్పాడు. కాదంటారా? శంకరాచార్య మాయను వదిలించబోయి ప్రేమను వదిలేశాడు. మీరేమో ప్రేమను పట్టుకోబోయి మాయనే ప్రేమంటూ పట్టేసుకున్నారు. స్వచ్ఛమైన జలంలాగా, స్వచ్ఛమైన ప్రేమ ఎక్కడా ఉండబోదంటారు. ఇదేనా మీరు చెప్ప దల్చుకుంది?''

మాయ అప్పుడే తడిసి ఆరిన మందారంలా మెరిసిపోతున్నది. ఇంత స్వచ్ఛమైన మనస్సు, హృదయం ఎన్నాళ్ళకో చూసినట్టనిపించింది. మాయ యొక్క స్వచ్ఛతను చూసి హర్షాతిరేకంతో ముద్దుపెట్టుకోవాలనిపించింది నాగార్జునగారికి. ఇదేమిటి ఇలాంటి ఆలోచన కలిగిందేమిటి అని సిగ్గుపడ్డాడు. మేధ నాన్నగారి జవాబు చెప్పలేని అవస్థ చూసి కిలకిలా నవ్వింది.

"మమకారంలో నిర్మమకారంగా, నిశ్చయంలో నిష్కామంగా, ప్రేమలో నిర్మలంగా ఉండడం ప్రేమ. అవి ఆశాపాశాలకు, మాయామోహాలకు అనువుగా కుదించబడ్డం మాయ అంది మహామాయ. మళ్ళీ "ఈ మాయ మన కోడలైతే ఎంత బాగుంటుందో'' నవ్వుతూ అంది మహామాయ.

"ఆంటీ-మెదట చెప్పింది ప్రేమ. ఈ మీ చివరి వాక్యం మాత్రం మాయ!'' అంటూ నవ్వింది మాయ. అందరూ ఆ నవ్వుతో శృతి కలిపారు.

మాయ, ప్రేమ తమను ప్రేమిస్తున్నామని ప్రేమలేఖలు రాసిన వారిలో ప్రేమెంత మాయెంత అని ఎవరికి వారు మనస్సులో బేరీజు వేసుకోవడం ప్రారంభించారు.

*(రచనాకాలం : మే, 1996)*

జులై - ఆగస్టు *1997*
ఆహ్వానం మాసపత్రిక